సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

జస్టిస్‌లు అంజరియా, విజయ్ బిష్ణోయ్, చందూర్కర్ నియామకానికి కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో సహా ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా గురువారం నియమితులయ్యారు. వీరు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యా బలం ప్రధాన న్యాయమూర్తితో కలుపుకుని పూర్తి స్థాయి 34కి పెరుగుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం ముగ్గురి పేర్లను సుప్రీం కోర్టు కొలీజియం గత సోమవారం సిఫార్సు చేసింది. వారిలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ అంజరియా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్ ఉన్నారు. న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గురువారం ఈ ముగ్గురు న్యాయమూర్తుల నియామకాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ హృషికేష్ రాయ్ పదవీ విరమణ దరిమిలా మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ మూడు ఖాళీలకు ఈ ముగ్గురి పేర్లను కొలీజియం సిఫార్సు చేసింది.

జస్టిస్ అంజరియా కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2024 ఫిబ్రవరి 25న ప్రమాణం చేశారు. 2011 నవంబర్ 21న గుజరాత్ హైకోర్టు అదనపు జడ్జీగా పదోన్నతి పొందిన ఆయన 2013 సెప్టెంబర్ 6న శాశ్వత జడ్జీగా నియమితులయ్యారు.

జస్టిస్ బిష్ణోయ్ 2024 ఫిబ్రవరి 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. 2013 జనవరి 8న రాజస్థాన్ హైకోర్టులో అదనపు జడ్జీగా నియమితులైన జస్టిస్ బిష్ణోయ్ 2015 జనవరి 7న అదే హైకోర్టులో పర్మనెంట్ జడ్జీగా ప్రమాణం చేశారు.



జస్టిస్ చందూర్కర్ 1988 జూలై 21న న్యాయవాదిగా బార్‌లో చేరారు. 1992లో నాగ్‌పూర్‌కు మకాం మార్చిన జస్టిస్ చందూర్కర్ వివిధ కోర్టుల్లో ప్రాక్టీసు చేశారు. 2013 జూన్ 21న బాంబే హైకోర్టు అదనపు జడ్జీగా పదోన్నతి పొంది తర్వాత పర్మనెంట్ జడ్జీగా నియమితులయ్యారు.

2026 నుంచి టోఫెల్‌లో మార్పులు

వెల్లడించిన ఈటీఎస్

న్యూఢిల్లీ, మే 29: వచ్చే ఏడాది నుంచి ఇంగ్లిష్ భాషా పరీక్ష(టోఫెల్)లో మార్పులు జరగనున్నాయి. విద్యార్థి సామర్థ్యాన్ని రియల్‌టైమ్ ఆధారంగా గుర్తించేందుకు వ్యక్తిగతంగా పరీక్షను నిర్వహించడంతోపాటు కృత్రిమ మేధ(ఏఐ) సహాయంతో ఐడెంటిటీ వెరిఫికేషన్ వంటి మార్పులు తీసుకురానున్నట్లు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీఎస్) వెల్లడించింది. టోఫెల్, జీఆర్‌ఈ వంటి పరీక్షలను నిర్వహించే ప్రిన్స్‌టన్‌కి చెందిన ఈటీఎస్ కొన్ని మార్పులు, ఆధునీకరణను గురువారం ప్రకటించింది. వీటిలో కొన్ని ఈ నెల 30 నుంచి అమలులోకి రానుండగా మిగిలివని 2026 నుంచి అమలు అవుతాయి. 2026 నుంచి టోఫెల్ ఐబీటీకి సంబంధించి చదవడం, వినడం విభాగాలలో బహుళ–దశల విధానాన్ని అమలులోకి తీసుకురానున్నది. విద్యార్థి ప్రతిభను అంచనా వేసేందుకు రియల్‌టైమ్ ఆధారిత మార్పులు చేయనున్నది. గ్రూపు డిస్కుషన్స్, ప్రాజెక్టు వర్క్ వంటి వాస్తవ విద్యాసంబంధ అంశాలలో విద్యార్థుల ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానాన్ని అంచనా వేసేందుకు వీలుగా పరీక్షను నిర్వహించనున్నట్లు ఈటీఎస్ పేర్కొంది. ఇంగ్లిష్ భాషను మాట్లాడే యూనివర్సిటీలలో చేరాలనుకుంటున్న స్థానికేతర విద్యార్థులకు ఇంగ్లిష్ భాష ప్రావీణ్యాన్ని అంచనా వేసేందుకు టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్(టోఫెల్) ఓ ప్రామాణికమైన పరీక్ష. 160కి దేశాలలోని 12,000కిపైగా సంస్థలు ఈ పరీక్షను గుర్తిస్తాయి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలతోపాటు బ్రిటన్‌లోని 98 శాతం యూనివర్సిటీలు ఈ పరీక్షను ఆమోదిస్తాయి.

ముగ్గురు భార్యలను, తొమ్మిది మంది పిల్లలను పోషించడం కోసం ఓ భర్త దొంగగా మారాడు. బెంగళూరు పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు బాబాజాన్‌ను అరెస్ట్ చేసి 188 గ్రాముల బంగారు ఆభరణాలు, 550 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అతని అరెస్టుతో 8 దొంగతనం కేసులు పరిష్కారమయ్యాయి. కుటుంబ పోషణ కోసం దొంగతనాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. ఇతని ముగ్గురు భార్యలు, వారి పిల్లలు వేర్వేరు చోట్ల ఉన్నారు. వారందరినీ ఇతనే పోషిస్తున్నాడు.

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో డిస్కంల ప్రైవేటీకరణను నిరసిస్తూ న్యూఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

యూపీ డిస్కంల ప్రైవేటీకరణపై కార్మికుల కన్నెర్ర

- దేశ వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యుత్తు ఉద్యోగుల నిరసనలు
- ప్రైవేటు సంస్థలతో సర్కారు కుమ్మక్కు అయిందని ఏఐపీఈఎఫ్ తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ, మే 29: ఉత్తర్‌ప్రదేశ్‌లోని పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్తు పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యుత్తు కార్మికులు కన్నెర్రచేశారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, త్రివేంద్రం, ముంబై, నాగ్‌పూర్, రాయ్‌పూర్, భోపాల్, జబల్‌పూర్, వడోదర, రాజ్‌కోట్, గువాహటి, షిల్లాంగ్, కోల్‌కతా, భువనేశ్వర్, పాట్నా, రాంచీ, శ్రీనగర్, జమ్ము, శిమ్లా, డెహ్రాడూన్, పాటియాలా, జైపూర్, కోట, హిస్సార్, లక్నో నగరాల్లో 27లక్షల మంది ఉద్యోగులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈ మేరకు అఖిల భారత విద్యుత్తు ఇంజినీర్ల సమాఖ్య (ఏఐపీఈఎఫ్) ఓ ప్రకటన విడుదల చేసింది. యూపీలోని మొత్తం 75 జిల్లాలకు గాను 42 జిల్లాలకు విద్యుత్తు పంపిణీ చేసే సంస్థలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదని ఏఐపీఈఎఫ్ అధ్యక్షుడు శైలేంద్ర దూబే మండిపడ్డారు. ప్రభుత్వం, విద్యుత్తు అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయల డిస్కంల ఆస్తులను నామమాత్రపు ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు వ్యక్తులతో చేసుకున్న తప్పుడు ఒప్పందాల కారణంగా ప్రభుత్వం ఒక్క యూనిట్ విద్యుత్తు కొనుగోలు చేయకుండానే ఏటా రూ.6,761 చెల్లించాల్సిన దుస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేటీకరణతో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి తలెత్తుతుందని తెలిపారు. యూపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు కొనసాగుతాయని, విద్యుత్తు సరఫరా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించారు.

కేరళీయుడికి రెండోసారి జాక్‌పాట్

దుబాయ్: యూఏఈలో నివసిస్తున్న ఓ కేరళీయుడికి అదృష్టం మరోసారి తలుపు తట్టింది. పదేండ్ల లోపే అతడు ప్రఖ్యాత దుబాయ్ డ్యూటీ–ఫ్రీ మిలీనియమ్ మిలియనీర్ లాటరీ పోటీలో సుమారు రూ.8.5 కోట్లు గెలుచుకున్నారు. చిన్న కాంట్రాక్టింగ్ కంపెనీలో సైట్ సూపర్‌వైజర్‌గా పనిచేసే పాల్ జోస్ మావెలీ(60) తొలిసారి నవంబర్ 2016లో ఈ పోటీలో భారీ నగదు బహుమతి పొందారు. తాజాగా మరోసారి అతడికి జాక్‌పాట్ లభించింది. దీనిపై సోషల్ మీడియాలో ఒక యూజర్ స్పందిస్తూ.. 'శుభాకాంక్షలు! భారతీయుడి అదృష్ట రహస్యాలను నేను తెలుసుకోవాలనుకుంటున్నాను' అని వ్యాఖ్యానించారు. 1999లో దుబాయ్ డ్యూటీ–ఫ్రీ మిలీనియమ్ ప్రారంభమైనప్పటి నుంచి పాల్ స్నేహితులతో కలిసి క్రమం తప్పకుండా లాటరీ కొంటున్నారని ఖలీల్ టైమ్స్ తెలిపింది.



వాల్‌స్ట్రీట్‌లో భారత బరాత్

న్యూయార్క్: న్యూయార్క్‌లోని ఐకానిక్ వాల్‌స్ట్రీట్ ఓ భారతీయ జంట పెండ్లి బరాత్‌తో హోరెత్తింది. ఈ ర్యాలీలో 400 మంది నృత్యం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. బంధుగణమంతా రంగురంగుల దుస్తులు ధరించి, బాలీవుడ్ పాటలకు స్టెప్పులేశారు. వధూవరులు కూడా ఈ వేడుకలో నృత్యం చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక ఫైనాన్షియల్ స్ట్రీట్‌లో ఈ వేడుక ఆహ్లాదం నింపింది. ఫైనాన్షియల్ హబ్ కాస్త నృత్యవేదికగా మారిందని, భారతీయ సంప్రదాయం ప్రపంచవేదికపై విరాజిల్లుతున్నదని పలువురు పేర్కొన్నారు. మరికొందరు ఇలాంటి ఆహ్లాదం, ఆనందం భారతీయులతోనే సాధ్యమని వ్యాఖ్యానించారు. వేడుక కొద్దిసేపట్లోనే ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లో వైరల్‌గా మారింది. ఈ వేడుకను నిర్వహించిన డీజే ఏజే ఇన్‌స్టా పోస్ట్‌లో కామెంట్ చేస్తూ వాల్‌స్ట్రీట్‌లో ఇలాంటి నృత్యవేడుక జరుగుతుందని ఎవరూ ఊహించలేదని.. జీవితంలో ఒక్కోసారి ఇలాంటి అద్భుతాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు.

మావోయిస్టు పార్టీ ఏరియా

కమిటీ సభ్యుడు హిడ్మా అరెస్ట్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 29 : మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు హిడ్మాను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేశారు. కోరాపుట్ పోలీస్ అధికారులు గురువారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బోయిపారిగూడ పోలీస్‌స్టేషన్ పరిధి పేటగూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు జిల్లా పోలీసులు, జిల్లా వలంటరీ ఫోర్స్(డీవీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులకు దిగడంతో తట్టుకోలేక కాల్పులు జరుపుకుంటూనే మావోయిస్టులు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక మావోయిస్టును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సదరు పట్టుబడ్డ మావోయిస్టును ఏరియా కమిటీ సభ్యుడు కుంజం హిడ్మాగా పోలీసులు గుర్తించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసుర్ పోలీస్‌స్టేషన్ పరిధి జనగూడ గ్రామానికి చెందిన హిడ్మా మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇతడి వద్ద నుంచి ఒక ఏకే–47 రైఫిల్‌ను, ఘటనా స్థలం నుంచి మందుగుండు, పేలుడు పదార్థాలను ప